ప్రజాశక్తి

బుధవారం 15 ఫిబ్రవరి 2023

5

అల్లూరి సీతారామరాజు



తాగునీటి ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో లక్ష్మీపురం పంచాయతీ కర్షపొదర్ గ్రామంలో విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన మంచి నీరు ట్యాంక్‌ను సమితి సీనియర్ మేనేజర్ రవి కుమార్, మేనేజర్ అబ్రహాంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రవికుమార్, అబ్రహాంలు మాట్లాడుతూ, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి సహకారంతో గిరిజన ప్రాంతాల్లో మంచి నీరు, విద్య, వైద్యం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఆయా గ్రామస్తుల శ్రమదానంతో గ్రావిటీ ద్వారా మంచి నీరు అందజేస్తున్నామన్నారు. సర్పంచ్ త్రినాథ్, ఎంపీటీసీ సాదరం మాట్లాడుతూ సంస్థ ద్వారా మంచి నీరు కల్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సుభద్ర, త్రినాథ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సమితి సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని.. వీఆర్ఏల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏజెన్సీలోని పలు మండలాల గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ)లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాడేరు తహసీల్దార్ కార్యాలయం నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్‌రావు, వీఆర్ఏల సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తిరి కొండబాబు, సిహెచ్. శేఖర్ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ అధికారంలో రాక ముందు పాదయాత్రలో కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, కంటిన్ జెన్సీ కార్మికులందరికీ రెగ్యులర్ చేస్తామని, కనీస వేతన అమలు చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయకపోగా కనీసం వేతనాలు కూడా పెంచకపోవడం దారుణమన్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో అనేకమంది రెవెన్యూ డిపార్ట్మెంట్లో వీఆర్ఏలుగా అనేకమంది ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ, నేటికీ రెగ్యులర్ చేయకపోగా, కనీస వేతనాలు కూడా లేకుండా పని చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల కనుగుణంగా జీతాలు సరి పోలేదన్నారు. సంక్షేమ పథకాలకు కోతలు పెడుతుండటంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నామిని వీఆర్ఏలకు ఉద్యోగం కల్పించాలని, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వో, ఓఎస్ వాచ్మెన్లు, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. డిప్ రికవరీ ఆపాలని, వీఆర్ఏలను నాలుగో తరగతి ఉద్యోగ గుర్తించాలన్నారు. వీఆర్ఏలకు ఫేస్ యాప్ హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంప చోడవరం డివిజన్ అధ్యక్షులు రామకృష్ణ, దేవిక,.అప్పారావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ నేతల నిరసన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నం కృష్ణ విశ్వవిద్యాలయంలో వసతి గృహాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ వైస్ చాన్స్ లర్ (విసి)కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నేతలపై ప్రభుత్వ పోలీసులతో దాడి చేయడం హేయమైన చర్య అని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు పి.చిన్నారావు తెలిపారు. అల్లూరు జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేయడం సిగ్గు చేటని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయకా ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. విద్యార్థి సంఘాల నాయకులను ఉద్యమకుంటూ పిడి గుద్దులతో దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి.నరేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతపల్లి ప్రాంతంలో చిరుత సంచారం

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలం సీతపల్లి, ముసురుమిల్లి ప్రాజెక్టు ఏరియాలో చిరుత పులి, మూడు పిల్లలు సంచరిస్తున్నట్లు గిరిజనులు చెబుతున్నారు. వీటి పాదముద్రలు మంగళవారం కనిపించడంతో స్థానికులు తీవ్రంగా భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో వాటి పాద ముద్రలను సేకరించామని, ల్యాబ్‌కు పంపుతున్నామని ఫారెస్టు రేంజ్ అధికారి కరుణాకర్ తెలిపారు. రెండు ప్రాంతాల్లో మూడు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీతపల్లి పాడుబడిన భవనంలో పాద ముద్రలు కనిపించాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిటిసి తుర్రం జగదీష్ దొర

ఆశ్రమ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

ఎటిడబ్ల్యుఒ దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

దేవీపట్నం మండలం మూసినిగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో ఇటీవల గిరిజన బాలిక మృతి చెందిన నేపథ్యంలో పిఎంసి చైర్మన్ కోసు భవాని అధ్యక్షతన మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఎటిడబ్ల్యుఒ సిహెచ్.రామ తులసి, దేవారం సర్పంచ్ తుర్రం రమాదేవి, ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పల సమస్యలను ఎటిడబ్ల్యుఒ దృష్టికి తీసుకొచ్చారు. ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎఎన్ఎం పోస్టును యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని, నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని, హాస్టల్ చుట్టూ ప్రహరీ ఎత్తు పెంచాలని, హాస్టల్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి ఆదివారం, రెండో శనివారం తల్లిదండ్రులు కలిసే విధంగా అవకాశం కల్పించాలని, మెనూ ప్రకారం సక్రమంగా ఆహారం అందించాలని, పిల్లలు అనారోగ్యానికి గురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు తెలియజేయాలని, ఆ సమయంలో స్వగ్రామానికి పంపించాలని తదితర డిమాండ్లతో ఎటిడబ్ల్యుఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, వార్డెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్టు విరిగి పోవడంతో.. నేల కూలిన విద్యుత్ స్తంభాలు

- విద్యార్థి మృతి, ముగ్గురికి గాయాలు -తల్లిదండ్రులు బంధువులు ఆందోళన

ప్రజాశక్తి హుకుంపేట: విద్యుత్ స్తంభం పడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న విద్యార్థి తూబూరు ధన్విత (6) మృతి చెందిన ఘటన మండలంలోని తాడేపూట్టు పంచాయతీ ఉర్రాడ బొడ్డపుట్టు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐబి సతీష్ కథనం మేరకు..ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో తుప్పు పట్టిన జీర్గ చెట్టు విరిగి పడటంతో నాలుగు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. అందులో పాఠశాల ఎదురుగా ఉన్న విద్యుత్ స్థంభం పడిపోవడంతో ఆరు బయట విద్యభ్యాసిస్తున్న నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఒక విద్యార్థి తూబూరు.ధన్విత (6) గుండెకు బలమైన దెబ్బ తగిలింది. హాస్పిటల్ కి తరలిస్తున్న సమయంలో మృతి చెందిందినట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు బంధువులు ఆందోళన

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరు బయట విద్య బోధన నిర్వహిస్తుండటంతో తమ పాప మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు. గతంలో విద్యుత్ స్తంభాలు తొలగించాలంటూ పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు వారు తెలిపారు. మృతికి కారకులైన ఉపాధ్యాయులకు వెంటనే సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం 25 లక్షల పరిహారం ప్రకటించాలని గిరిజన సంఘం, మానవ హక్కుల విద్య బోధన, బాలల హక్కుల పరిరక్షణ వేదిక నేతలు డిమాండ్ చేశారు.



కూలిన విద్యుత్ స్తంభం (ఇన్‌సెట్‌లో మృతి చెందిన పాప)




మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

సంక్షేమం పేరుతో సంక్షోభం

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత వైసిపికే దక్కుతుందని, అప్పులకుప్పగా మార్చారని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి విమర్శించారు. మంగళవారం పాడేరు మండలం గుత్తులపుట్టు, జి.ముంచింగిపుట్టు పంచాయతీల్లోని గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు..ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో గిరిజన గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి జాడే కనిపించలేదని అన్నారు. వైసిపికి రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదనే విషయం ఆ పార్టీ నేతలకు అర్థమైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గబ్బాడ సింహాచలం, కోడా వెంకట సురేష్ కుమార్, డప్పోడి వెంకటరమణ, సర్పంచ్ బాబురావు, వెంకట ప్రసాద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

పుల్వామా అమర జవాన్లకు నివాళి

ప్రజాశక్తి -సీలేరు

2019 ఫిబ్రవరి 14న పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన 40 మంది జవాన్లకు జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ పోలీసులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. అమర జవాన్ల చిత్ర పటాలకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న శ్రీనగర్ నుంచి జమ్మూకు కాన్వాయ్ మీద వస్తున్న బలగాలపై ఉగ్రవాదులు దాడి చేసి 40 మందిని పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. ఈ రోజును ప్రభుత్వం బ్లాక్ డేగా పరిగణించిందని చెప్పారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

పుల్వామా అమర జవాన్లకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వినోద్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. తల్లిని, చెల్లిని, సతీమణిని విడిచిపెట్టి సరిహద్దుల్లో రక్షణ చర్యలు చేపడుతూ ఎంతోమంది ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు.



డిమాండ్ చేస్తున్న గంగరాజు, సర్పంచ్‌లు

రోడ్డు పనులు ప్రారంభించాలి

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: పారెస్టు అధికారుల అభ్యంతరాలతో నిలిచి బొంగిజా, డెక్కపురం రోడ్లను వెంటనే పనులు పున్నప్రారంభించాలని జెడ్పీటీసీ. దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం జెడ్పీటీసీ తో పాటు లుంగపర్తి, కివర్ల పంచాయతీ సర్పంచ్ బృందం కివర్ల పంచాయతీ బొంగిజా రోడ్డు ను పరిశీలించారు. గ్రామస్తులు రోడ్డు సౌకర్యం లేక పడుతున్న కష్టలను గంగరాజుకు వివరించారు .అనంతరం జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలోనే జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర సహకారంతో అనంతగిరి మండలంలో రూ.10. కోట్లతో 5 రోడ్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. లంగుపర్తి పంచాయతీ చిడివలస గ్రామం నుండి కివర్ల పంచాయతీ బొంగిజా గ్రామం వరకు 2 కోట్లా 40 లక్షలతో రోడ్డు మంజూరై రోడ్డు పనులు జరుగుతుండగా జీనబాడు ఫారెస్ట్ రేంజ్ అధికారుల అభ్యంతరంతో గుత్తేదారులు పనులు నిలిపి వేశారన్నారు.అనేక సార్లు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళి పిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడినా ఫారెస్టు అధికారులు అనుమతులు ఇవ్వకుండా గిరిజనుల అభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. ఈ నెల 23న జరగనున్న జిల్లా పరిషత్ సమావేశంలో ఈ సమస్యను తెలుపుతానన్నారు. ఈ కార్యక్రమంలో కివర్ల సర్పంచ్ పుట్టబోయిన ముత్యాలమ్మ, లంగుపర్తి సర్పంచ్ సివేరి. సన్యాసిరావుదొర, వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, అనంతగిరి సిపిఎం మండల కార్యదర్శి సోమేల నాగులు, చొంపి వెంకటరావు, సూకురు గంగన్న, పుట్టబోయిన. దేముడు, పి.సోమన్న, కురిడెబోయిన లచ్చన్న, బొంగిజ గ్రామం ప్రజలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి అనంతగిరి: మండల యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా యుటిఎఫ్ ఎన్నికల అధికారి తాంగుల .చిట్టిబాబు అధ్యక్షతన మంగళవారం మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి బొర్రా జంక్షన్ వద్ద అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలు జరిగాయి. మండల గౌరవ అధ్యక్షులుగా వివి. ఈశ్వరరావు, అధ్యక్షులుగా పుడిగి దేముడు, సహా అధ్యక్షులుగా కెవివి.ఉషారాణి, బిఎస్ఎన్ పడాల్, ప్రధాన కార్యదర్శిగా టి.కృష్ణంనాయుడు, కోశాధికారిగా శెట్టి పరమేశ్వరరావు, కార్యదర్శులుగా కామిడి ప్రసాద్, రమేష్ నాయుడు, కె.రామారావు, సింహాచలం, రామాచందర్, అకడమిక్ కన్వీనర్‌గా ప్రసాదరావు, సభ్యులుగా ఎ.లచ్చన్న. జె.దేవుడు, జె సత్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా డి. సోమశేఖర్, సభ్యులుగా డి.పొన్నలు, ఎస్.లక్ష్మణ, జె .శివ, మహిళ కమిటీ కన్వీనర్‌గా సూర్యకాంతం, సభ్యులుగా రాధిక, జె.సుధారాణి, శెట్టి మహేశ్వరి, కాంప్లెక్స్ హైస్కూల్ శాఖ సెక్రటరీగా టి. బాలకృష్ణ, జి .దయనిది, సభ్యులుగా పి కృష్ణారావు, పి.సొమరశెట్టి లక్ష్మణరావు, జిల్లా కౌన్సిలర్లుగా రాంబాబు, గంగులు, అర్జున్, వి.బాస్కరరావు, వివి. రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



హాజరైన నేతలు

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన

రిజర్వ్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శరత్ చంద్ర

ప్రజాశక్తి - రంపచోడవరం

ఆన్‌లైన్ మోసాలపై అన్ని మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శరత్ చంద్ర అన్నారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు చెందిన వెలుగు ఎపిఎంలు, డిపిఎంలు, ఎఫ్‌పిఒలు, మహిళా సంఘాల లీడర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ చంద్ర మాట్లాడుతూ ప్రతి మనిషికీ ఏదో ఒక బ్యాంకులోనైనా అకౌంట్లు తప్పకుండా ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల డబ్బులు అర్హులైన లబ్ధిదారులకు ఆయా అకౌంట్లలో జమ అవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక ప్రవర్తన పాటించాలని, వడ్డీలకు అప్పులు తీసుకోకుండా సంపాదించిన డబ్బులో కొంత పొదుపు చేసుకుంటే భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఏజెన్సీలోని జీరో అకౌంట్ కలిగిన వారికి పిఆర్ కోడ్ లేకపోతే ఏర్పాటు చేయాలని కోరారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ అనుమతితో నడుస్తున్న బ్యాంకుల ద్వారా మాత్రమే రుణాలు తీసుకోవాలని సూచించారు. పలు బ్యాంకు పథకాలపై శరత్ చంద్ర వివరించారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ప్రతి మనిషికీ చాలా ముఖ్యమైనదన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రవితేజ మాట్లాడుతూ ఏజెన్సీలోని వివిధ రకాల వ్యాపారాలు చేయడానికి రుణాల కోసం దరఖాస్తులు వస్తే ఆ జాబితాను తమకు సమర్పిస్తే సంబంధిత బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతామని చెప్పారు. ఏ బ్యాంకు లోనైనా అకౌంటుదారుని సివిల్ స్కోర్‌ను బట్టి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రీజనల్ బ్యాంకు నోడల్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ అకౌంటుదారునికి ఎవరైనా ఫోన్ చేసి మీకు ఓపిటి వస్తుందని, దానిని చెప్పమని అడిగితే చెప్పొద్దని, చెబితే అకౌంట్లో డబ్బులు గల్లంతవుతాయని తెలిపారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన మోసాలు ఏమైనా జరిగితే ఆయా బ్యాంకులకు సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్న పరిశ్రమల ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు. డిపిఎంలు పరమేశ్వరరావు, అపర్ణ, యాంకర్ పర్సన్ రామరాజు, సిఎఫ్ఎల్‌లు చిట్టితల్లి, ప్రకాష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజ్ కిషోర్, ఏపీఎంలు అప్పారావు, మధు, జేమ్స్, ఆదినారాయణ, శ్యాం కుమార్, వెలుగు సీసీలు, ఎఫ్‌పిఓలు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

'సైకిల్ ఫర్ హెల్త్' ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ కార్యాలయంలో వైద్య అధికారి కెవి.నాగభూషణం ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ఫర్ హెల్త్ పేరుతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే. హిమబిందు మాట్లాడుతూ సైకిలింగ్ ప్రతిరోజు చేయడం వలన ఆరోగ్యానికి బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ప్రధానంగా శరీరక బరువు, ఒత్తిడి రక్తపోటు నియంత్రించుకోవచ్చని పేర్కొన్నారు. శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కాకుండా నిద్ర సమయస్ఫూర్తిగా పడుతుందని పేర్కొన్నారు. జేమ్స్ గల్లాగర్ బిబిసి అధ్యయనం ప్రకారం సైకిలింగ్ వల్ల ఏ కారణం చేతనైనా 41శాతం మరణాలను నియంత్రించుకోవచ్చని, కేన్సర్ సంబంధిత మరణాలు 45 శాతం, గుండెకు సంబంధించిన మరణాలు 46శాతం అదుపు చేయవచ్చని తెలిపారు. నులిపురుగులు నివారణ మందులు కూడా విద్యార్థులకు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌లు నాగలక్ష్మి, లోవ కుమారి, ఎంపిహెచ్ఈఓ పోతురాజు, పారామెడికల్ సిబ్బంది గోవిందు అప్పారావు, బాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు హిమబిందు, నాగభూషణం, వైద్య సిబ్బంది, విద్యార్థులు



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గండి కొత్త గూడెం సర్పంచ్ నాగమణి

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని గండి కొత్త గూడెం గ్రామం వద్ద చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆ గ్రామ సర్పంచ్ నాగమణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి లేక గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఈ రహదారిని బిటి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మోహన్, వార్డు సభ్యులు తొండ లక్ష్మణ్, గ్రామ పెద్దలు ఉయిక కన్నయ్య, పొడియం రామారావు, తెల్లం తమ్మయ్య కాంట్రాక్టరు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష

ప్రజాశక్తి-చింతూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 15న బుధవారంఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ (నైతిక విలువలు- మానవతా విలువలు) పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రఘురామ్ తెలిపారు. ఈ నెల 17న పర్యావరణ విద్య (ఎన్విరాన్మెంటల్ స్టడీస్) పరీక్ష ఉంటుందన్నారు. ఈ రెండింటి పరీక్ష కోసం ఈ విద్యా సంవత్సరంలో 142 విద్యార్థులు హాజరవుతారని, గతేడాది ఈ పరీక్షలు రాయని వారు, రాసి ఉత్తీర్ణత కాని విద్యార్థులు కూడా ఈ పరీక్షలు రాసుకొనే వెసులుబాటు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ వారు కల్పించారని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న విఆర్‌ఎలు

సమస్యలపై విఆర్‌ఎల ధర్నాలు

విఆర్‌ఎలను ఫేస్ యాప్ అటెండెన్స్ బయోమెట్రిక్ నుంచి మినహాయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్ల వద్ద మంగళవారం ధర్నాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో విఆర్‌ఎలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు, కన్వీనర్ సత్యం మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రికవరీ చేసిన డిఎ తిరిగి చెల్లించాలన్నారు. పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అనకాపల్లి : సమస్యలపై విఆర్‌ఎలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ తీసుకోవడం వల్ల విఆర్‌ఎలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయాలకు దూరంగా వీరు విధులు నిర్వహించడం వల్ల, ఎక్కువ మంది చదువుకోకపోవడం వల్ల ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోలేరన్నారు. పే స్కేల్ అమలు చేయాలని, రికవరీ చేసిన డిఎను తిరిగి చెల్లించాలని, అర్హత ఉన్న విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. నామినీగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవికుమార్, కె.లోవరాజు, ఉపాధ్యక్షులు నరేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.శాంతి కుమారి, కోశాధికారి ఎన్.సంతోష్, సహాయ కార్యదర్శి డేవిడ్ పాల్గొన్నారు.

పలుచోట్ల రమాప్రభ ప్రచారం



కశింకోటలో ప్రచారం నిర్వహిస్తున్న రమాప్రభ

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని తుమ్మపాల, కొత్తూరు, నరసింగరావుపేట ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను గెలిపిస్తే వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైల్వే జోన్ ఇవ్వాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక హక్కుల కోసం పోరాడుతానని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఒపిఎస్ సాధన కోసం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ వంటి అంశాలపై పోరాడుతానన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల సామాజిక న్యాయం కోసం, మహిళల సమానత్వం కోసం పోరాడుతానన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జె.రమేష్ బాబు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, కె.తేలయ్య బాబు, రమణ, తరుణ్ పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రంలో పలుచోట్ల రమాప్రభ ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు డిడి.వరలక్ష్మి, ఎ.బాలకృష్ణ, దాకారపు శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, జి.శ్రీరామ్, రమేష్, తరుణ్, రమణ పాల్గొన్నారు.

పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం



అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం తదితరులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అల్లూరి జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది, అధికారులు శత శాతం విధులు నిర్వహించి పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం, కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ తెలిపారు. అరకులోయ మండలంలోని పర్యటనలో భాగంగా మంగళవారం రవ్వలగూడ అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం పై అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లల ఎదుగుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. కోడి గుడ్లు బరువు, నాణ్యతను పరిశీలించి స్టాక్ రికార్డులతో స్టాక్ ను సరిపోల్చారు. పిల్లల తల్లులతో మాట్లాడి అంగన్వాడి కేంద్రాల పని తీరు, సరుకులు పంపిణీ, సిబ్బంది సమయ పాలన, సేవలపై ఆరా తీసారు. అనంతరం కమిషన్ సభ్యులు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణలు మాట్లాడుతూ, ప్రభుత్వం పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా పౌష్టికాహారం బాల్యం నుండే అందించాలన్న లక్ష్యంతో ఉందన్నారు.అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది బాధ్యతా యుతంగా విధులు నిర్వహించకుండా, గైర్హాజరవుతున్నట్లు తెలుస్తుందన్నారు. ఇటువంటి వారిపై క్రమ శిక్షణ చర్యలతో పాటు అవసరమైతే పూర్తిగా ఉద్యోగాల నుండి తొలగించేందుకు ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు ఆదేశాలిచేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు.అనంతరం యండపల్లివలస కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్కూల్ రికార్డులు పరిశీలించారు. మెను సక్రమంగా అమలు చేయక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మెను సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పదని హెచ్చరించారు.

అరకులోయ ఏరియా ఆసుపత్రిలోని పిల్లల వార్డును రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణలు సందర్శించారు. ఆసుపత్రిలో ఈ ఏడాది ఇంతవరకు నమోదైన ఔట్ పేషెంట్ల, పిల్లల కేసుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంప్ ల ఏర్పాటు, రక్త హీనత తగ్గించటానికి తీసుకుంటున్న చర్యలపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బి.లవకుశ, ఫోరం ప్రతినిధులు కే.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పిఒ పరిశీలన



పూలగరువు గ్రామస్తులతో మాట్లాడుతున్న టిడిపిఎ పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మండలంలోని మారు మూల గ్రామాల్లో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ పర్యటించి అభివృద్ధి పనులను తనిఖీ చేసారు. ఐనాడ పంచాయతీ పూల గరువు పివిటిజి గ్రామానికి సిసిడిపి నిధులు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును మంగళవారం పరిశీలించారు.చీములాపల్లి పంచాయతీ రోడ్డు నుండి పూల గరువు గ్రామానికి సిసి రోడ్డు నాణ్యతలు పరిశీలించారు. రోడ్డు కిరువైపుల బెర్ములు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పూలగరువు గ్రామస్తులతో మాట్లాడి గ్రామ సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అందరికి ఆధార్ కార్డులు ఉన్నది లేనిది ఆరా తీసారు. గ్రామానికి గ్రావిటీ పథకం సదుపాయం ఉందని, అదనంగా బోరు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. అంతకు ముందు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో వెలుగు దుకాణాన్ని సందర్శించారు. ఆన్‌లైన్ బిల్లింగు విధానాన్ని అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్ఎం రాజు, డిఇ అనుదీప్, ఐనాడ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: కాఫీ రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని, రూ.60 కోట్ల బకాయి సొమ్ము చెల్లించాలని కోరుతూ కివర్ల పంచాయతీ బొంగిజా గ్రామం వద్ద మండల కాఫీ రైతు సంఘం ప్రతినిధి సివేరి కొండలరావు ఆధ్వర్యన రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, ఈనెల 17వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగే కాఫీ రైతుల మహాధర్నకు రైతులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కివర్ల పంచాయతీ సర్పంచ్ ముత్యాలమ్మ, లుంగపర్తి సర్పంచ్ సన్యాసి దొర, మండల గిరిజన సంఘం నాయకులు ఎస్. నాగులు, కాఫీ రైతులు తదితరులు పాల్గొన్నారు

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముంచింగిపుట్టు: మండలంలో వనగుమ్మ పంచాయతీ దాబుగుడా గ్రామంలో గ్రామ కాఫీ రైతులతో సమావేశాన్ని గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు కొర్ర శంకర్రావు నిర్వహించారు. కాఫీ రైతుల బకాయి సొమ్ము ఐటీడీఏ పీవో తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.60 కోట్లను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో పాడేరు ఐటీడీఏ కార్యాలయం ముట్టడి చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వి.నాగేష్, కిరిసాని సుఖదేవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్

పర్యాటకుల భద్రత కోసమే టూరిస్ట్ పోలీస్ స్టేషన్

ఎస్‌పి సతీష్ కుమార్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పర్యాటకుల భద్రత కోసం టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను ప్రారంభిస్తున్నట్టు అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 26 టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ప్రారంభించారు. దీనిలో భాగంగా అల్లూరి జిల్లా అరకులోయ గిరిజన మ్యూజియం, బొర్రా గుహలు, రంపచోడవరం దేవిపట్నం టూరిస్ట్ కేంద్రాల్లో టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంగళవారం అరకులోయ గిరిజన మ్యూజియం వద్ద సిఐ జీడి బాబు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ స్టేషన్ అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పర్యాటకులకు భద్రత కల్పించాలని ఉద్దేశంతోనే టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. టూరిస్టులు దేశ విదేశాల నుంచి అనేకమంది వస్తుంటారని, ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే ఈ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-జి.మాడుగుల: పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని బోయతిలి పంచాయతీ చాపరాయి గ్రామంలో చోటు చేసుకుంది. చాపరాయి గ్రామానికి చెందిన కొర్ర దేవలక్ష్మి సోమవారం కట్టెలకు అడవికి వెళ్లి తిరిగి సాయంత్రం సమయంలో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పాము కాటు వేయటంతో అక్కడికక్కడే మృతి చెందింది.ఆమెతో పాటు తన పిల్లలు కూడా వెంట ఉండటంతో గ్రామస్తులకు విషయం తెలిపారు. గ్రామస్తులు వెళ్లేసరికి ఆమె మృతి చెందింది.మృతురాలికి ముగ్గురు బాలికలు, ఒక బాలుడు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-పెదబయలు : కాకినాడ జిల్లా ఆయిల్ ట్యాంకర్‌లో మృతి చెందిన మండలంలోని పరేడ, బొండపల్లి పంచాయతీల బాధిత కుటుంబాలను మంగళవారం రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజనులు పండించిన వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర లేక పొట్ట కుటీ కోసం ఇతర జిల్లాలకు వెళుతున్నారన్నారు. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమి కేటాయింపు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి ములియాగూడ గ్రామంలో సర్వే నెంబర్ 13లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఫారెస్ట్ శాఖకు కేటాయిస్తూ ప్రభుత్వం అప్పగించడంతో స్థానిక సర్పంచ్ కిలోమస్య ఆధ్వర్యాన మంగళవారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎన్.సీతారాం సిబ్బందితో కలిసి బోర్డును ఏర్పాటు చేశారు. ఈ భూమిని ఎవరైనా వ్యక్తులు ఆక్రమించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని బోర్డులో పేర్కొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : కెడిపిఎమ్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనలను పరిశీలించారు. విద్యార్థులను అభినందించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులలో ఉన్న మేధో సంపత్తిని పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. 10వ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళికతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

గిరిజన మిత్ర ఆధ్వర్యాన వైద్య శిబిరం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని కె.ఏరంపాలెం గ్రామంలో గిరిజన మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యాన ఎస్‌కెహెచ్ హాస్పిటల్స్ సహకారంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గిరిజనులకు వివిధ రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, గర్భిణుల సమస్యలు, గుండె జబ్బులు, సాధారణ సమస్యలపై వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన మిత్ర మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ శ్రీనివాస్, వైద్యులు వెంకట కృష్ణ, సాంబ, గ్రామ సర్పంచ్ పండా లక్ష్మి, ఎంపీటీసీ కారం కుమారి, గిరిజన మిత్ర సిబంది నాగేశ్వరరావు, శ్రీను, సూరిబాబు, బాపన్న, రామకృష్ణ, ఏసుబాబు, సురేష్, రాజేంద్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధితో మెరుగైన విద్య



బోధనను పరిశీలిస్తున్న పర్యవేక్షక బృందం

ప్రజాశక్తి- ఆనందపురం: మెరుగైన విద్యకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం దోహదపడుతుందని రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ఆర్. శర్మ అన్నారు. మంగళవారం బోని, శిర్లపాలెం, గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను రాష్ట్ర పర్యవేక్షణ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా.శర్మ మాట్లాడుతూ 6,7,8 తరగతుల విద్యార్థులలో అభ్యసనా అభివద్ధికి గతేడాది నవంబర్ 28న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి ఉపాధ్యాయుల బోధన, టీచింగ్ పిరియడ్, ప్రాక్టీస్ పీరియడ్, మోడల్ క్లాసుల తర్వాత విద్యార్థులను చదివించడం ద్వారావారిలో అభ్యసనా సామర్థ్యాలను పెంచడమే దీని ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్, విజయనగరం డైట్ ప్రిన్సిపల్ ఎం.తిరుమలనాయుడు స్టేట్ రిసోర్స్ గ్రూప్ నెంబర్ రాంబాబు, బి.అప్పలరాజు, ఎం. శారద, ఆర్.సన్యాసిరావు పాల్గొన్నారు

పద్మనాభం: మండలంలోని మద్ది, పద్మనాభం, .రెడ్డిపల్లి, పొట్నూరు పాఠశాలలను రాష్ట్రస్థాయి పర్యవేక్షణ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. 6, 7,,8 తరగతులకు బోధన విధానం, అభ్యసనాస్థాయిపై పరిశీలించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిఇఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ, పాత పరదేశిపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని కూల్చేసిన వారిని గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం నాలుగో వార్డు టిడిపి అధ్యక్షులు పాసి నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసిపి పాలనలో ప్రభుత్వ ఆస్తులు, ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గజ్జి రాజు, పాసి త్రినాధ్ కుమార్, డి సిద్ధార్థవర్మ, తొత్తడి సూర్య పాల్గొన్నారు

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ కన్నారావు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల కేంద్రంలో మంగళవారం ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ వద్ద ఈ ర్యాలీని సర్పంచ్ కారం కన్నారావు ప్రారంభించారు. ఐటిడిఎ నుండి చింతూరు మండలం కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఒ పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో వైయస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు ప్రారంభించినట్లు చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామస్థాయిలో వైద్యులు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసిపాక మెడికల్ ఆఫీసర్ ఉదయ రెడ్డి, వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


గీతం వర్సిటీని టిసిఎస్ బృందం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న టిసిఎస్ ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ ఐటి సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) మానవ వనరుల నియామకపు నిపుణుల బృందం మంగళవారం సందర్శించింది. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ సహయ డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్, డైరెక్టర్ వంశీకృష్ణ కిరణ్ తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గీతం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ గీతం, టిసిఎస్‌ల మధ్య సంబంధాలను మెరుగైన రీతిలో కొనసాగిస్తామన్నారు. టిసిఎస్ టాలెంట్ డెవలప్‌మెంట్ అధిపతి జెవిఆర్ఎస్ ప్రసాద్, ఆంధ్ర,తెలంగాణ ప్రాంతీయ నియామక అధిపతి ఫర్విన్ అహ్మద్, హెచ్‌ఆర్ మేనేజర్ కె.రమాకాంత్, ఫాతిమా తదితరులు గీతం తృతీయ సంవత్సరం విద్యార్థులతో మాట్లాడారు. టిసిఎస్ సంస్థలో ఉద్యోగుల ఎంపిక విధానం, సంస్థ లక్ష్యాలు, యువతకు సంస్థలో కల్పిస్తున్న సదుపాయాలు, అంతర్గత శిక్షణ కార్యక్రమాలు గురించి వివరించారు. విద్యార్థులు తాము చదివే కోర్సుపై లోతైన అవగాహన కలిగి, స్వయంగా ఆలోచించి ప్రాజెక్టులను రూపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు సందేహలకు సమాధానాలు ఇచ్చారు.

వైద్య విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



వైద్యవిద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యనిపుణులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో దంత వైద్య విద్యార్థులకు మంగళవారం నైపుణ్య శిక్షణ శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ మాక్సిల్లో ఫేషియల్ సర్జర్స్ డే సందర్భంగా ముఖ, దవడ, నోరు శస్త్ర చికిత్స విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అధునాతన పద్ధతుల్లో దవడ శస్త్ర చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్, ముఖ, దవడ, నోరు శస్త్ర చికిత్స విభాగ అధిపతి డాక్టర్ ఫణి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అధునాతన పద్ధతుల్లో శస్త్ర చికిత్స, దవడ జాయింట్ మార్పిడి, సర్జరీపై కూడా వర్క్ షాప్ జరిగింది.ఈ సందర్భంగా చెన్నై మీనాక్షి యూనివర్సిటీ ఉపకులపతి నీలకందన్‌కు, అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ ట్రస్ట్ సిపిడి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణా రెడ్డి అందజేశారు. రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆసుపత్రి అత్యవసర శస్త్రచికిత్స విభాగం అధిపతి డాక్టర్ రాకేష్ అవగాహన కల్పించారు.

రబీ సాగుపై క్షేత్రస్థాయిలో పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : రబీ సీజన్లో సాదారణ, ఉద్యాన పంటల సాగుపై వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్, పర్యవేక్షణాధికారి జి లక్ష్మణకుమార్ మంగళ వారం సింగనబంద గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేసి పరిశీలించారు. రబీలో వేస్తున్న పంట రకాలు, సాగునీటి సదుపాయం వంటి వివరాలతో పాటు ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకున్నదీ, లేనిదీ రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీమిలి మండలంలో రబీ సీజన్లో 870 ఎకరాలలో సాదారణ, 130 ఎకరాలలో ఉద్యానవన పంటల నమోదు జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివకోమలి వివరించారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, హెచ్ఒఎం, ఎఒ పిశ్రీకాంత్, సింగనబంద ఆర్‌బికె సిబ్బంది ఎల్ హరీష్ పాల్గొన్నారు

చిన్న పరిశ్రమల శాఖ ద్వారా రుణాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : అర్హులైన యువతీ యువకులకు చిన్న పరిశ్రమల శాఖ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8వ తరగతి ఉత్తీర్ణత, ఆపై చదువుకున్న యువతీ యువకులకు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాస రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవితేజ, రీజనల్ బ్యాంకు నోడల్ అధికారి సత్య నారాయణ, డిపిఎంలు పరమేశ్వరరావు, అపర్ణ, పిఎంఇజిపి యాంకర్ పర్సన్ రామ రాజు, ఏడు మండలాల ఎపిఎంలు, ఎఫ్‌పిఒలు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

దేవస్థానం సిబ్బందిపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలంలో పాత ఇంటి గచ్చును మరమ్మతులు చేయించుకుంటున్న సరస్వతి అనే మహిళ ఇంట్లోకి గోడ దూకి చొరబడి, అలమరా గోడలపై అమర్చిన పలకలను దౌర్జన్యంగా తొలగించిన దేవస్థానం సిబ్బందిపై గోపాలపట్నం పోలీస్‌స్టేసన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. గతంలోనూ ఇదేమాదిరిగా ఇంటిముందు వేస్తున్న గచ్చును కూడా దౌర్జన్యంగా తొలగించిన ఘటనపై అప్పట్లోనూ ఫిర్యాదు చేశారు. దేవస్థానం భూముల పరిరక్షణ పేరిట సిబ్బంది ఆగడాలకు అంతూపొంతూ లేకుండా పోతోందని స్థానికంగా తీవ్ర చర్చ సాగుతోంది. సోషల్‌మీడియా వేదికగా దీనిపై పోరాటాలు చేయాలని మెసేజ్‌ల ప్రచారం సాగుతోంది.

సింహాచలంలో సినిమా షూటింగ్ సందడి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలంలో రామ్‌చరణ్ సినిమా షూటింగ్ సాగుతోంది. మంగళవారం సింహగిరిపై గాలిగోపురం ఎదురుగా అత్యంత ఖరీదైన సెట్‌వేసి పాట చిత్రీకరణ చేశారు. ఈ సెట్టింగ్‌పై దేవస్థానం ఇఒ వి త్రినాధరావు సినీ నిర్మాత దర్శకులతో చర్చించారు. కాగా కొండ దిగువ వరాహ పుష్కరిణిలో అమ్మవారి జాతర పాట చిత్రీకరణ కూడా భారీ సెట్టింగుల మధ్య మధ్యాహ్నం నుంచి నిర్వహించారు. ఒకేరోజు రెండు షూటింగ్‌లతో అటుగా వెళ్లే వాహనచోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆంక్షలపై అసహనం వ్యక్తం చేశారు.

దిశ యాప్‌పై లఘు చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి -గాజువాక : మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో న్యూపోర్టు పోలీసుల ఆధ్వర్యంలో పెదగంట్యాడ పరిసర ప్రాంతాల్లో లఘుచిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. దిశయాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర, ఆపద సమయాల్లో దాన్ని ఉపయోగించుకుని పోలీసుల రక్షణ ఎలా పొందాలో చిత్రం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు న్యూపోర్టు ఎస్ఐ మన్మథరావు తెలిపారు. దిశా యాప్‌పై అవగాహన పొంది, వినియోగించు కోవాలని సూచించారు. ఈ చిత్రాన్ని చిత్రీకరించిన సీనియర్ రిపోర్టర్ రామచంద్రరావును 76వ వార్డు హౌసింగ్ బోర్డ్‌కాలనీ శ్రీ గణేష్‌దుర్గ యూత్ యువకులు అభినందించారు.

కిక్ బాక్సింగ్ విజేతకు అభినందన

ప్రజాశక్తి -తగరపువలస : ఛాంపియన్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ - 2023 కిక్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి రేడియాలజీ విభాగంలో ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం పవవ సతీష్ విజేతగా నిలిచాడు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు డార్జిలింగ్ గోర్కీ స్టేడియంలో వాకో, కెఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న 46-49 కిలోల విభాగంలో సత్తా చాటిన పవన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. విజేత వపన్‌కు పశ్చిమ బెంగాల్ యువజన సర్వీసులు, క్రీడల శాఖా మంత్రి అరూప బిశ్వాస్ ట్రోఫీ, పతకం అందించారు. విజేత పవన్‌ను ఆసుపత్రి యాజమాన్యం ప్రధాన కార్యదర్శి డి.జయభరత్ రెడ్డి, సిఇఒ నిరంజన్ కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాధామాధవ్ త్రిపాఠి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, వైద్యులు, రేడియాలజీ విభాగం ఉద్యోగులు మంగళవారం ఆసుపత్రిలో అభినందించారు